# ఆయన మరణము మరియు పునరుత్థానాలలో యేసు యొక్క మానవత్వం శిఖరాగ్రాన్ని చేరుకుంది

ప్రభువైన యేసు మానవత్వముయొక్క అత్యున్నతమైన స్థాయి ఏది? యేసు "సంపూర్ణంగా నరుడై" యున్నాడనడానికి, ఆయన ప్రార్థనా జీవితము కల్వరిలో ఆయన మరణము అనే రెండు గొప్ప ఉదాహరణలను తెలిపాం. ఆ నామానికి తగినట్టు చేసే ప్రార్థన మరియు మరణాన్ని మనం దృష్టించే తీక్షణత నరునియొక్క చాలని తనానికీ, ఆధారపడడం అనేదానికినీ రుజువులై నిలిచియున్నట్టు చెప్పబడింది. మనం ఎవరిమీద ఆధారపడుతున్నామో ఆయన చిత్తాన్ని వెదకుతూ, ఆయన మీద ఆధారపడియుంటాం; మరణములో మర్త్యతను దాటి ఆయనయందు జీవాన్ని ఎదురు చూస్తాం.

లేఖనాల్లో, ప్రభువైన యేసు ప్రార్థించినట్టు వింటాం. మరియు సిలువపై మరణించినట్టు మనం చూస్తాం. ఈ అనుభవాలు యేసునందలి నిజమైన మనుష్యత్వాన్ని సమర్థవంతంగా వ్యక్తీకరిస్తాయి "నా దేవా, నా దేవా, నన్ను ఎందుకు చెయ్యివిడిచితివని" సిలువపై నుండి పలికినప్పుడు ఎలా ప్రార్థించాలో నేర్పించడానికి ఆయన అవకాశాన్ని తీసికో లేదు (మార్కు 15:34). వేదన యొక్క ఉద్వేగపు లోతులలోనుండియు, నీవు గ్రహింప శక్యముకాని భయంకరమైన శ్రమానుభవమునుండియు ఆయన బిగ్గరగా పలుకుతున్నాడు. దాన్ని మనం గ్రహించలేము ఎందుకంటే మనం ఎన్నడు అక్కడ ఉండలేదు సరిగదా; మనం అక్కడ ఎన్నడు ఉండబోము, ఎన్నడు ఉండలేము కూడా. సృష్టికర్తయే, సృష్టిగా అయినట్టు మనమెన్నడు సృష్టికర్తయైయుండలేం. మహిమను విడిచి తన్ను తాను రిక్తునిగా చేసుకున్న నరమాత్రులుగా మనమెన్నడు దైవత్వం వహించలేదు. నీవు, నేను ఆదర్శమైన, గంభీరమైన జీవితాలను జీవించి, వేదన కరమైన చావులు చచ్చినా, పాపరహితమైన జీవితాలను మనం ఎన్నడూ కలిగియుండలేం, పరిపూర్ణమైన బలులుగా మనలను మనమెన్నడును సమర్పించుకోలేం. అత్యంత వేదన కరమైన హింసను, పూర్ణమైన ఏకాంతతను ఎవడును ప్రభువు సిలువలో విడిచిన తీరులో విడువడు.

ఎవడును ఎన్నడూ జీవించనంత అత్యంత సంపూర్ణమైన జీవితాన్ని యేసు జీవించడం మాత్రమే గాక (హెబ్రీ. 4:15; 1 పేతురు 2:22), ఎప్పుడూ పొందనంత హీనాతి

హీనమైన పరిపూర్ణ మరణాన్ని ఆయన మరణించాడు (2 కొరింథీ. 5:21). తాను చేయవచ్చిన పనిని నెరవేర్చడంలో నరునిగా, ప్రభువైన యేసు బహు ఉన్నతమైన జీవన అనుభవాలతో జీవించాడు, మరణించడంలో బహు బాధకరమైన మరణపు అనుభూతులను అనుభవించాడు. తన్ను అనుసరించేలా కేవలం ఒక మాదిరిని విడిచి వెళ్లడానికి మాత్రమే ఆయన అవతరించలేదు (1 పేతురు 2:21). ఆశ్చర్యకరమైన జీవపు మాటలను కేవలం బోధించడానికి మాత్రమే వచ్చియుండలేదు (యోహాను 6:63). “లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు” (యోహాను 3:17).

చేయవచ్చిన ఆయన పని జన్మించడం, జీవించడం, మరణించడం అనే వాటికంటెను అధిగమించినదైయుంది. తన పని నెరవేర్చబడాలంటే ఆయన జన్మ ఏకైకమైనదై ఉండాలి, ఆయన జీవితం నిష్కళంకమైనదై ఉండాలి, ఆయన మరణం, సంపూర్ణంగా నిజమై యుండాలి. భూమిమీద ఆయన జీవితంలోని ప్రతి విషయంలోను ఎన్నడూ జీవించని నరులందరికంటెను అతి శ్రేష్ఠమైన మానవ స్వభావాన్ని ఆయన ప్రకాశింపజేశాడు. ఆయన “సగము దేవుడై”నందున ఆయన పరిపూర్ణుడుకాడు – కాని ఆయన నిజముగా మానవుడై ఉండి – కళంకమేగాని, మచ్చయేగాని లేనివాడైనందున ఆయన పరిపూర్ణుడై యున్నాడు. జన్మనుండి మరణ పర్యంతము మానవ చరిత్రయంతటిలో శ్రేష్ఠమైన జీవితం – పాపరహితమైన జీవితాన్ని జీవించినది యేసు ఒక్కడే.

## ఆయన మరణం

పవిత్రుడైన, శాంతికరుడైన అద్వితీయ యేసు, నశించినదానిని రక్షించే తన పనిని ఎలా సాధించనైయున్నాడు? గెత్సేమనే యొక్క కీలకమే అది. తన తండ్రి చిత్తం నెరవేర్చబడాలని ఆయన దీక్షబూనాడు: “దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్ను తానే సమర్పించుకొనెను, ...” (1 తిమోతి 2:5, 6ఎ). “మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెనని” ప్రభువు అన్నాడు (మార్కు 10:45).

అంత పవిత్రుడును, అంతటి అతి ప్రియుడైన వ్యక్తిని ఎందుకు బలిచేయాలి – ఆ మరణం అంత తీక్షణంగాను, అంత కఠోరంగాను ఎందుకు ఉండాలి? ఉన్నతమైన దేవుని పరిశుద్ధతను బట్టి. మారని ఆయన తీర్మానాన్ని బట్టిన్నీ, పరిపూర్ణమైన న్యాయాన్ని బట్టిన్నీ జరగాలి. ఆయన పరిశుద్ధత పాపాన్ని అసహ్యించుకొంటుంది; ప్రతి పాపము శిక్షకు లోను కావలసిందే. అందులో ఎటువంటి తప్పించుకునే ఉపాయమూ లేదు. తన బిడ్డలు చేసే చెడు పనులను ప్రేమ, సహవాసం అనే సూత్రాలతో పోనిచ్చే గారాబంగల తండ్రిలాంటివాడు కాదు దేవుడు. దానికి భిన్నంగా, “ప్రతి అతిక్రమమును అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొందియున్న”ట్టు పురాతన కాలంనుండి చెప్పబడ్డాం (హెబ్రీ.

2:2బి); మరియు "ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించినయెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటమీద, కనికరింపకుండ వాని చంపించుదురు" (హెబ్రీ. 10:28). క్రొత్త నిబంధనలోనైతే, "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" అని మనం తెలుసుకున్నాం (హెబ్రీ. 9:27). పాపము భయంకరమైనది; క్షమించబడకపోతే అది మరణకరమైనదై ఉంటుంది.

సంపూర్ణుడైన పరిశుద్ధ దేవుని న్యాయం కోరిన దానిని తీర్చడానికి పాపరహితుడైన క్రీస్తు యొక్క సంపూర్ణమైన బలికి మించినదేదియు సరిపోదు. గనుక తండ్రియైన దేవుని చిత్తానికి సంపూర్ణంగా తన్ను తాను అర్పించుకున్న దేవుని కుమారుడు, విమోచన క్రయధనాన్ని చెల్లించాడు. ఆయన శరీరము మరియు రక్తము (ఆయన ప్రాణం) దేవుని న్యాయమంతయు కోరిన దానినంతటిని నింపగలిగినదై కొలత వేయలేనంత విలువగలదై ఉంది. తన ఈవిని అంగీకరించినవారిని తండ్రియైన దేవుడే క్షమించినప్పుడు ఆయన తన వ్యక్తిత్వమంతటితో సమన్వయం కలిగియుండేలా చేస్తుంది. "కనికరము తీర్పును మించి అతిశయపడును" లేక జయమొందును (యాకోబు 2:13బి).

ప్రభువైన యేసు మృతినొందుచుండగా, "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని"యు; "సమాప్తమైనది!" అనియు; "తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నానని"యు ఆయన పలికాడు (లూకా 23:34; యోహాను 19:30; లూకా 23:46). ఈ మాటల యొక్క ప్రాముఖ్యతను మానవ మనస్సు గ్రహించుకొనడం అసాధ్యమే కావచ్చు. ఏదియెలాగున్నా, ప్రభువు యెరుగును, అంతే కాదు ఆయన అనుభవించిన కఠోరమైన మరణ వేదనలను ఆయన నిష్కపటంగానే అనుభవించాడు. అరువు తెచ్చుకున్న సమాధినుండి ఆయన పునరుత్థానంతో తండ్రి యింటికి వెళ్లే ప్రయాణం యింకా మిగిలియుంది. ఆయన మానవత్వం దాని హద్దులకు పరిమితి చేయబడియుంది. ఆయన జన్మ మహిమాయుక్తమయ్యింది (లూకా 2:6, 7, 13, 14). ఆయన జీవితం అత్యంత పవిత్రమైనది. ఆయన మరణమే ఆయన విజయం. ఆయన తన తండ్రి చిత్తాన్ని జరిగించడానికి వచ్చాడు ఆయన దానిని జరిగించాడు!

## ఆయన పునరుత్థానం

ప్రభువు యొక్క పునరుత్థానము ఆయన జయోత్సవమైయుంది - మరియు అది ఎలాటి పునరుత్థానము! మానవ చెవులకు వినబడని, మనిషి చేతులతో తాకబడని, మనిషి కన్నులతో వీక్షింపబడని, మనిషి మనస్సులకు గోచరముకాని సజీవుల లోకానికి ప్రభువు తిరిగి వెళ్లాడు.

ఆయన పునరుత్థానము, ఆయన ఆరోహణమునకు మధ్యకాలంలో, ఆయన వందలకొలది మంది జనులచే తిలకింపబడ్డాడు (1 కొరింథీ. 15:1-8). మానవ దృష్ట్యా, ప్రభువైన యేసు యొక్క ప్రత్యక్షతలు వింతయనే వస్త్రంచే కప్పబడ్డాయి. కొన్ని ఉదాహరణలను గమనించు. ఆదివారం ఉదయం పెందలకడనే మగ్దలేనే మరియ, యింకను చీకటియుండగా, యేసు సమాధి చేయబడిన చోటుకు వెళ్లింది. సమాధి

తెరువబడి యుండడం తాను చూచిన తరువాత, ఆయన దేహం అక్కడనుండి తొలిగించబడినట్లు ఆమె తలంచింది. ఆమె ఏడ్చుచుండగా, ప్రభువు ఆమెకు ప్రత్యక్షమై ఆమెతో మాట్లాడాడు. "యేసు ఆమెతో – నేను ఇంకను తండ్రియొద్దకు ఎక్కిపోలేదు గనుక నన్ను ముట్టుకొనవద్దు; అయితే నా సహోదరులయొద్దకు వెళ్లి – నా తండ్రియు మీ తండ్రియు, నా దేవుడును మీ దేవుడునైన వానియొద్దకు ఎక్కిపోవుచున్నానని వారితో చెప్పుమనెను" (యోహాను 20:1–18 చదువు). కొందరు స్త్రీలు ప్రభువు లేచిన సంగతిని తన పదకొండుమంది అపొస్తలులకు తెలిపినప్పుడు, "వారి మాటలు వీరి దృష్టికి వెర్రిమాటలుగా కనబడెను" (లూకా 24:6–11). పేతురు సహితం ఖాళీ సమాధిని చూచాడు, "అతడు జరిగినదానిని గూర్చి ఆశ్చర్యపడుచు ఇంటికి వెళ్లెను" (లూకా 24:12బి). అదే రోజు యిద్దరు మనుష్యులు ప్రభువుతో భుజించారు. మొదట్లో వారాయనను గుర్తించలేదు; వారాయనను గుర్తించిన తోడనే ఆయన అదృశ్యుడాయెను (లూకా 24:13–31). తదనంతరం కొద్ది సేపటికే, యెరూషలేములో, అపొస్తలులతో కలిసియున్న వారికి ఆయన ప్రత్యక్షమయ్యాడు. "అయితే వారు దిగులుపడి భయాక్రాంతులై, భూతము తమకు కనబడెనని తలంచిరి." అప్పుడాయన, తాను భూతముకాదని చెప్పి తనను పట్టిచూడుమనియు, భూతమునకు ఎముకలు మాంసం ఉండవని చెప్పి, తన కాళ్లలోను చేతులలోను ఉన్న గురుతులను ఆయన వారికి చూపాడు (లూకా 24:36–43).

ఒక వారం తరువాత, తలుపులు బిగించియున్న గదిలోని తన అపొస్తలులకు ఆయన కన్పించాడు ఆ సమయంలో తోమా వారితోకూడా లేడు. అందునుబట్టి అతడు ఆయన పునరుత్థానమందు తన అవిశ్వాసాన్ని కనుపరచాడు. అయితే ఈ సమయంలో అతడు వారితోకూడా ఉన్నాడు. ప్రభువు అతనితో యిలా అన్నాడు: "నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి, అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమనెను. అందుకు తోమా ఆయనతో – నా ప్రభువా, నా దేవా అనెను" (యోహాను 20:27, 28).

గలిలయలో యేసు తన పదనొకండుగురు అపొస్తలులకు ప్రత్యక్షమైనప్పుడు ఆయన వారికి తన ఘనత్వముగల ఉత్తరువును ప్రసాదించాడు, అప్పుడు, "వారు ఆయనను చూచి ఆయనకు మ్రొక్కిరి, గాని కొందరు సందేహించిరి" (మత్తయి 28:16, 17). పునరుత్థానంతర కాలంలో, ప్రభువు తన అపొస్తలులకు నలువది దినములవరకు కన్పించినట్టు లూకా తెలిపాడు. "అనేక రుజువులను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనుపరచుకొనెను" అని అపొ. 1:3 చెప్పుతుంది. కడకు, బేతనియకు సమీపమున నున్న ఒలీవకొండవద్దకు వారిని తోడుకొని వెళ్లి, పరలోకమునకు వారి యెదుట కొనిపోబడ్డాడు (లూకా 24:51).

వింతయనే (పరాయి) వస్త్రముతో ఈ సంభవాల్లో అనేకాలు కప్పబడ్డాయని మనం ఎందుకు చెప్పాము? శిష్యులు ప్రభువైన యేసు యొక్క పునరుత్థానాన్ని అంగీకరించడానికి కష్టపడినందుకా? వాస్తవంగా, అనేకులు దాన్ని అంగీకరించడానికి కష్టపడ్డారు, కాని అది ఎదురు చూడనిది కాదు. దైవశాస్త్ర పరిధిలో పునరుత్థానాన్ని చర్చించడం సులభం కావచ్చు, సిద్ధాంతంగా; అక్షరార్థమైన సంభవంగా దాన్ని అవగాహన చేసికొనడం అంత

తేలిక కాదు. పునరుత్థానము పాతాళలోకపు పరిమాణంతో కూడినదైనందున దానితో వ్యక్తిగతమైన అనుభవాన్ని ఆధారం చేసికోలేం. ఆయన ప్రత్యక్షమైనప్పుడు ప్రభువుయొక్క అనుచరులలో కొందరు భయపడడంలో వింత ఏదైనా ఉందా? తప్పకుండా లేదు. కొద్ది దినాలకు ముందు నీ కన్నుల యెదుట సిలువ వేయబడి, సమాధి చేయబడిన ఒకడు తిరిగి నీ యెదుట నిలిచియుండడము చూస్తే వచ్చే పరిణామం ఏమో ఆలోచించు. జీవించియున్న మనిషి నిజంగా చనిపోయి, సమాధి చేయబడిన వ్యక్తియేనని నీవు నిండుగా నమ్మియున్నట్టయితే, నీవు తప్పక "వేరొక లోకంలోని" వాతావరణాన్ని గ్రహిస్తావు. ఇది "మానవ – అతీతమైన – రూపమని" నీవు ఎరుగుతావ్. ఏదో యొక వింత జరుగుతుందని నీవు తెలిసికొంటావ్.

యేసు పునరుత్థానము తదుపరి ప్రత్యక్షతల చుట్టూ అనేక అసాధారణమైన సంగతులున్నాయి. అపొస్తలులు దీనిని వివిధ రకములైన ప్రతి క్రియలతో ప్రదర్శించారు. ప్రభువు తన సొంత మాటలతోను, కార్యములతోను, ప్రత్యక్షతలతోను దీనికి తోడ్పడ్డాడు. తన పునరుత్థానాంతరం ఆయన, "నన్ను ముట్టుకొనకుము ... నేనింకను తండ్రియొద్దకు ఎక్కిపోలేదు" (యోహాను 20:17). యోహానును గూర్చి పేతురుతో, "నేను వచ్చువరకు అతడుండుట నాకిష్టమైతే అది నీకేమని" ఆయన అన్నాడు (యోహాను 21:23బి). ఆయన ప్రత్యక్షతలు తరచుగా అసాధారణమైన పరిస్థితిలో సంభవించాయి. ఇంతకు మునుపు ఎప్పుడును ప్రభువు తలుపులు వేయబడిన, తాళం వేయబడిన, గదులలోనికి ఆయన వచ్చి పోయి ఉండలేదు. కొన్ని సార్లు తేలికగా ఆయన గుర్తింపబడలేదు. సంఘటనలో వింతైన మార్పులు జరిగాయి.

ప్రభువు యొక్క భూ నివాస కాలం పూర్తయ్యింది. ఎలాటి గాథయది! ఏమి జీవితమది! ఎలాటి రక్షకుడు! దేవుని బుద్ధి విజ్ఞాన బాహుళ్యాన్ని గూర్చి నీవెప్పుడైనా ఆలోచించావా? సర్వాంతర్యామియైన కుమారుడగు దేవుడు "లోకం లోనికివచ్చి" కొంత "కాలం" గడిపి, తరువాత, ఆయన నిత్యత్వంలో ప్రవేశించి ఒకేసారి సదాకాలంలో ఉండగలడు? తన సృష్టి యొక్క బ్యాలన్స్‌ను అప్‌సెట్ చేయకుండ ఆయన ఈ పనిని ఎలా చేయగలిగాడో? మన నక్షత్ర రాసిలో మహా విపత్తు జరిగి దాని ప్రభావంవలన భూమిమీద విపత్కరమైన సంభవం జరుగకుండ ఆయన తన శక్తిని "ఉంచుకో"గలిగాడు? దానికి జవాబు యేసుక్రీస్తునందు కన్పిస్తుంది. ఎందుకంటే, "దేవుడు క్రీస్తునందు లోకమును తనతో" సమాధానపరచుకున్నాడు (2 కొరింథీ. 5:19ఎ).

ఈ మహత్తరమైన సాహస కృత్యం ఎలా సాధ్యమయ్యిందని మనం ఆలోచిస్తుండగా, క్రీస్తు జీవితంలో రెండు గొప్ప మార్పులు కన్పిస్తాయి లేక బయటపడ్డాయి. అందులో మొదటిది, దేవత్వంనుండి మానవత్వానికి ప్రాముఖ్యత మారింది. దేవదూత గణం యొక్క సంగీతనాదం మధ్య శిశువుగా యేసు అవతరించాడు, అయితే, ఆయన పొత్తిగుడ్డలతో చుట్టబడి పశువుల తొట్టిలో పరుండబెట్టబడ్డాడు. ఆయన కన్యగర్భమందు జన్మించాడు, కాని ఆయన యోసేపు కుమారుడుగా ఎంచబడ్డాడు.[1] ఆయన జీవిత మంతటిలో అలాగే అది నిలిచింది. కుమారుడైన దేవుడు మానవ రూపులో ప్రత్యక్షుడయ్యాడు. నరావతారము నిజమైనది. పౌలు యిలా వ్రాశాడు,

> క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను (ఫిలిప్పీ. 2:5–8).

రెండవది, మానవత్వంనుండి దేవత్వానికి ప్రాముఖ్యత మారింది. ఆయన మానవత్వము ఆయన దేవత్వాన్ని కప్పివేసింది లేక మరుగు చేసింది. ఈ మార్పుయొక్క "వింత" మధ్య, తెరువబడుతున్న ముసుగు గుండ తోమా కడకు చూడగలిగాడు. "నా ప్రభువా, నా దేవా!" అని అతడు పలికాడు (యోహాను 20:28). ఇది ఒకే ఒక మనిషియొక్క ఒప్పుకోలు అని నీవు అనుకోవచ్చు. అది నిజమే, కాని కుమారుడైన దేవుడు తన్ను తాను మానవాళికి బయలుపరచుకునే విషయంలో యిది చారిత్రకమైనది, కీలకమైనది, ఆ ప్రత్యక్షతయొక్క ప్రాధాన్యతను దృష్టిలో ఉంచడానికిని ఒప్పుకోడానికిని అది మలుపు తిరుగు విషయంగా ఉంటుంది.

ఈ మార్పు ఆరోహణమునందు పరిపూర్ణత చెందింది. సజీవంగా మరెన్నడు చూడబడకుండేలా ప్రభువు కేవలం అదృశ్యుడగుటకు మాత్రమే కాదు. ఆయన తన అపొస్తలులతో "ఈ మాటలు చెప్పి, వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను" (అపొ. 1:9). ఈ విధంగా, మానవత్వాన్ని నొక్కి చెప్పే దానినుండి దేవత్వానికి జరిగే మార్పు సంపూర్తియైయుంటుంది.

నమ్మశక్యము కాని ఈ రెండు మార్పుల్లో తన జననమందు యేసు దేవుడుగా తక్కువగాను, నరుడుగా ఎక్కువగాను లేక ఆయన మరణ సమయాన నరుడుగా తక్కువగాను దేవుడుగా ఎక్కువగాను మారాడని దృఢపరచడం లేదు. ఆ ప్రతి మార్పులోను కేవలం గంభీరంగా కన్పించేదాన్ని స్పష్టంగా పరిశీలించాం. మనం నేర్చుకున్నదేమంటే, క్రీస్తు యేసునందలి దేవుని విమోచనా కార్యము సులువుగా తెలిసేంత తేలికైనది కాదు. ఏదియెలాగున్నా, గ్రహింపు అయిన తరువాత మాత్రం, దేవుని ప్రేమ, కృప, కనికరము మన జీవితాలను ఆయనయందలి విశ్వాసము, ప్రేమ, కృతజ్ఞత, పరిచర్యకు సమర్పించుకునేలా నడిపిస్తుంది.

అలాగే, బైబిల్లో కన్పించే కృతజ్ఞత గీతము ప్రకటించబడుతుంది, కొన్ని సార్లు, "నరావతారము యొక్క గీతముతో" "కుమారుడైన దేవుని" గూర్చిన చర్చనీయాంశము ముగించడానికి తగినదైయుంటుంది: "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదైయున్నది; ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మవిషయమున నీతిపరుడని తీర్పునొందెను దేవదూతలకు కనబడెను రక్షకుడని జనములలో ప్రకటింపబడెను లోకమందు నమ్మబడెను ఆరోహణుడై తేజోమయుడయ్యెను" (1 తిమోతి 3:16).

---

సూచనలు

[1]లూకా 1:34, 35; 2:33, 34, 41, 42, 48; 3:23; మత్తయి 13:55, 56; యోహాను 6:42.